www.toliadugudaily.com
www.epaper.toliadugudaily.com

# తొలిఅడుగు

తెలుగు దిన పత్రిక

## టీయూడబ్ల్యూజే -ఐజేయూ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన



3

హైదరాబాద్ | సంపుటి : 01 | సంచిక : 272 | మంగళవారం | 04- 03 - 2025 | ఎడిటర్ : పి. జయరాం | పేజీలు : 8 | వెల : 4

## వెంటనే పిల్లల్ని కనండి!



తొలిఅడుగు, న్యూఢిల్లీ : కొత్తగా పెళ్లైన వాళ్లు వెంటనే పిల్లల్ని కనాలని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ పిలుపునిచ్చారు. తమిళనాడుపై కత్తి వేలాడుతోందని, పిల్లల్ని ఎక్కువగా కనకపోతే రాష్ట్రం రాజకీయంగా తీవ్రంగా నష్టపోతుందని కూడా స్టాలిన్ తమిళ

2

## రాష్ట్రవ్యాప్తంగా 17 కేసులు నమోదు



తొలిఅడుగు, అమరావతి : ఒకదాని తర్వాత ఒకటి.. రప్పా.. రప్పా.. కేసులు వెంటాడుతూనే ఉన్నాయ్..! చూస్తుంటే త్వరలోనే పోసాని కృష్ణమురళికి కంప్లీట్ ఏపీ యాత్ర తప్పేలా లేదు..! ఎక్కడికక్కడ కేసులు ఉండడంతో.. వారెంట్లపై

2



# 8వ తేదీకల్లా అభ్యర్థుల ఖరారు.?

- ఎమ్మెల్సీల అంశం తేలగానే మంత్రివర్గ విస్తరణ?
- ఈ నెలాఖరు కల్లా కొలిక్కి వచ్చే అవకాశం!
- మంత్రివర్గ విస్తరణపై సీఎం రేవంత్‌రెడ్డి దృష్టి

తొలిఅడుగు, హైదరాబాద్ : ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక పూర్తి కాగానే.. మంత్రివర్గ విస్తరణపై సీఎం రేవంత్‌రెడ్డి దృష్టి పెట్టనున్నారా? బడ్జెట్ సమావేశాల విరామ సమయంలో దీనికి సంబంధించి కసరత్తు జరగనుందా? ఈ నెలాఖరు కల్లా ఆ కసరత్తు ఓ కొలిక్కి రానుందా? బడ్జెట్ సమావేశాల తర్వాత కొత్త మంత్రులు కొలువుదీరనున్నారా? ఈ ప్రశ్నలకు కాంగ్రెస్ పార్టీ వర్గాలు.. అవుననే సమాధానమే ఇస్తున్నాయి. మరో మూడు, నాలుగు రోజుల్లో ఎమ్మెల్సీ అభ్యర్థులు ఖరారు కానున్నారని.. ఆ తర్వాత సామాజిక సమీకరణలు, ఇతర అంశాల ఆధారంగా మంత్రి వర్గ విస్తరణ కసరత్తు జరగనుందని ఆ వర్గాలు చెబుతున్నాయి. అయితే శాఖల మార్పులతో సరిపెడతారా... లేక ఒకరిద్దరిని మార్చి కొత్తవారిని నియమిస్తారా అన్నదానిపై స్పష్టత లేదు. కాగా, ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో సామాజిక కూర్పు.. మంత్రివర్గ విస్తరణ కసరత్తుపై ప్రభావం చూపే అవకాశమున్నట్లు చెబుతున్నారు. అసెంబ్లీలో కాంగ్రెసకున్న సంఖ్యా బలాన్ని బట్టి 4 ఎమ్మెల్సీ సీట్లు దక్కనున్న సంగతి తెలిసిందే. ఈ 4 సీట్లలో ఒక సీటు అగ్రకులానికి, ఒకటి ఎంబీసీలకు, ఎస్సీ మాదిగ, ఎస్సీ మాలకు

2


## రామమందిరమే టార్గెట్




తొలిఅడుగు, న్యూఢిల్లీ : గుజరాత్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ హర్యానాలోని ఫరీదాబా ద్‌లోని పాలి ఏరియాలో ఒక టెర్రరిస్టును అరెస్టు చేసింది. అతని నుంచి రెండు గ్రెనేడ్‌లు, విప్లవ సాహిత్యం స్వాధీనం చేసుకుంది. కేంద్ర ఏజెన్సీలు, ఫరీదా బాద్ ఎస్‌టీఎఫ్

2

## చేతిలో కెమెరా.. ముందు సింహం



తొలిఅడుగు, న్యూఢిల్లీ : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గుజరాత్ పర్యటనలో ఉన్నారు. సోమవారం ప్రపంచ వన్య ప్రాణుల దినోత్సవం సందర్భంగా, ప్రధాని మోదీ జునాగఢ్ జిల్లాలోని

2

## ఏపీ ప్రభుత్వంపై సంచలన ఆరోపణలు



తొలిఅడుగు, న్యూఢిల్లీ : కృష్ణా జలాల వినియోగంలో తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం జరుగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కృష్ణా బేసిన్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అధిక నీటిని తీసుకుంటోందని ఆయన విమర్శించారు. నీటి తరలింపును అడ్డుకోవాలని తాము కేంద్రాన్ని కోరామని స్పష్టం చేశారు. సోమవారం న్యూఢిల్లీలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీ.ఆర్. పాటిల్‌తో సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, పలువురు తెలంగాణ ఎంపీలతోపాటు నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన ప్రాజెక్టులు, కృష్ణా, గోదావరి నదీ జలాల కేటాయింపు, వినియోగంపై సుదీర్ఘంగా చర్చించారు. అలాగే ఇటీవల జరిగిన ఎస్‌-ఎల్‌బీసీ టన్నెల్ సంఘటనను సైతం మంత్రికి వీరు సోదాహరణగా వివరించారు. అనంతరం కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ కార్యాలయం

2

## పదోతరగతి హాల్‌టికెట్లు విడుదల



తొలిఅడుగు, అమరావతి : పదోతరగతి విద్యార్థుల కోసం ఏపీ ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. పదోతరగతి పబ్లిక్ పరీక్ష, మార్చి 2025 హాల్ టిక్కెట్‌లు ఇవాళ (సోమవారం) మధ్యాహ్నం 2:00 గంటల నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఏపీ ప్రభుత్వం ప్రకటించింది. అధికారిక వెబ్‌సైట్ అందుబాటులో ఉంచుతున్నట్లు చెప్పింది. మీ పాఠశాల ద్వారా లాగిన్ చేసుకోవచ్చని తెలిపింది. మన మిత్ర, ఏపీ ప్రభుత్వ వాట్సాప్ సేవల ద్వారా (9552300009), విద్యా సేవలను పొందవచ్చని పేర్కొంది. దరఖాస్తు సంఖ్య, విద్యార్థుల ఐడీ, పుట్టిన తేదీని నమోదు చేయడం ద్వారా హాల్ టిక్కెట్‌లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఏపీ ప్రభుత్వం తెలిపింది. ఎస్సెస్సీ పరీక్షల హాల్ టికెట్లు వాట్సాప్ గవర్నెన్స్ మనమిత్ర ద్వారా ఈ మధ్యాహ్నం 2 గంటల నుంచి పొందవచ్చని మంత్రి నారా లోకేష్ తెలిపారు. అలాగే వాట్సాప్‌లోని మనమిత్ర ద్వారా

2

## 14 వేల అంగన్‌వాడీ పోస్టులకు ముహూర్తం ఫిక్స్



తొలిఅడుగు, హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర స్త్రీశిశు సంక్షేమ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క గుడ్‌న్యూస్ చెప్పారు. మార్చి 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో లక్ష మందితో సభ నిర్వహిస్తామని తెలిపారు. ఇదే రోజు 14,236 అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల నియామకాలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేస్తామని వెల్లడించారు. మొత్తం పోస్టుల్లో అంగన్‌వాడీ టీచర్ పోస్టులు 6,399, హెల్పర్ పోస్టులు 7,837 ఉన్నాయి. ఈ మేరకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ నిర్వహణపై శనివారం

2

## మెగా డీఎస్సీతో 16,347 టీచర్ పోస్టుల భర్తీకి త్వరలో ప్రకటిస్తాం



తొలిఅడుగు, అమరావతి : ఏపీ అసెంబ్లీలో బడ్జెట్ పద్దులపై ఇవాళ (సోమ వారం) చర్చ ప్రారం భమైంది. వివిధ కేటాయింపులు, సంక్షేమానికి నిధుల అంశాలపై చర్చిస్తున్నారు. ఇవాళ సభ ముందుకు మున్సిపల్ చట్ట సవరణ ఆర్డినెన్స్ తీసుకురానుంది. సభలో మంత్రి నారాయణ ప్రవేశపెట్టనున్నారు. ఏపీ ఫిల్మ్ అండ్ టెలివిజన్‌పై వార్షిక నివేదికను సభలో మంత్రి కందుల దుర్గేష్ ప్రవేశపెట్టనున్నారు. పరిశ్రమలు, ఇంధన శాఖల వార్షిక నివేదికలను సభలో ముందు మంత్రులు టీజీ భరత్, గొట్టిపాటి రవికుమార్ ఉంచనున్నారు. ఈ సందర్భంగా

2

## 17 వరకు రిమాండ్



తొలిఅడుగు, విజయవాడ : గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో సీఐడీ అధికారులు కోర్టులో పీటీ వారెంట్ దాఖలు చేశారు. దీనిపై వర్చువల్‌గా వల్లభనేని వంశీని విచారించింది న్యాయస్థానం. ఈ నెల 17 వరకు మాజీ ఎమ్మెల్యేకు న్యాయస్థానం రిమాండ్ విధించింది. గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో వంశీ ఏ71గా ఉన్నారు. కాగా.. వంశీకి సంబంధించి కేసులపై ఈరోజు (సోమవారం) విజయవాడ కోర్టులో విచారణ జరిగింది. ప్రధానంగా మూడు అంశాలపై వంశీ నాయవాదులు, ప్రాసిక్యూటర్లు వాదనలు వినిపించారు. బ్యారక్ మార్చాలంటూ వంశీ కోర్టులో పిటిషన్ వేయగా.. కౌంటర్ దాఖలు చేయాలంటూ ఎస్సీ, ఎస్టీ కోర్టు ఆదేశిస్తూ

2

# రామమందిరమే టార్గెట్

మొదటిపేజీ తరువాయి

గుజారాత్ ఏటీఎస్ ఈ గాలింపు చర్యలు చేపట్టింది. రామమందిరంపై దాడి చేయడం టెర్రరిస్టు టార్గెట్‌లలో ఒకటిగా ఉన్నట్టు విశ్వసనీయవర్గాలు తెలిపాయి. ఫరిదాబాద్‌లో అరెస్టయిన వ్యక్తిని ఉత్తరప్రదేశ్‌కు చెందిన 19 ఏళ్ల అబ్దుల్ రెహ్మాన్‌గా గుర్తించారు. అతని వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న గ్రెనేడ్‌లను నిర్వీర్యం చేశారు. రెహ్మాన్‌కు టెర్రరిస్టు సంస్థలతో ఉన్న సంబంధం, అతని టార్గెట్‌కు సంబంధించి మరింత సమాచారం రాబట్టేందుకు అతన్ని గుజరాత్‌కు తరలిస్తున్నారు. రెహ్మాన్ అరెస్టుతో భారీ ఉగ్రదాడి కుట్ర భగ్నమైనట్టు చెబుతున్నారు. కాగా, గుజరాత్ ఏటీఎస్ చేపట్టిన ఆపరేషన్ ఇంకా కొనసాగుతున్నట్టు అధికారులు చెప్పారు.

# వెంటనే పిల్లల్ని కనండి!

ప్రజలను హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం లోక్‌సభ స్థానాల పునర్విభజన చేపడుతున్న నేపథ్యంలో స్టాలిన్ ఈ వ్యాఖ్యలు చేశారు. జనాభా ప్రతిపదికన లోక్ సభ నియోజకవర్గాలను పునర్విభజన చేయాలని కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం భావిస్తోంది. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ఈ లోక్ సభ నియోజకవర్గాల డీలిమిటేషన్ వల్ల తమిళనాడుకు లోక్ సభ సీట్లు తగ్గుతాయని, దాంతో రాజకీయంగా తమిళనాడు ప్రాధాన్యత కోల్పోతుందని సీఎం స్టాలిన్ అన్నారు. గతంలో తాము జనాభా నియంత్రణ కోసం ఎంతో కృషి చేశామని, ఇప్పుడు అదే తమకు ముప్పులా మారే అవకాశం ఉందని అన్నారు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వ జనాభా సంఖ్య ఆధారంగా లోక్ సభ నియోజకవర్గాలను పునర్విభజిస్తే.. ఉత్తరాది రాష్ట్రాల్లో ముఖ్యంగా బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో లోక్ సభ సీట్ల సంఖ్య పెరిగి, బీజేపీయేతర పార్టీ, ప్రాంతీయ పార్టీలు బలంగా ఉన్న రాష్ట్రాల్లో లోక్‌సభ సీట్ల సంఖ్య తగ్గే అవకాశం ఉందని ఇప్పటికే దక్షిణాది రాష్ట్రాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో స్టాలిన్ ఇచ్చిన పిలుపు చర్చనీయాంశంగా మారింది.

ఈ డీలిమిటేషన్‌పై చర్చించేందుకు మార్చ్ 5న అఖిలపక్షం ఏర్పాటు చేస్తామని స్టాలిన్ వెల్లడించారు.

# 17 వరకు రిమాండ్

మొదటిపేజీ తరువాయి

విచారణను వాయిదా వేసింది. అలాగే గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో సీఐడీ పీటీ వారెంట్ దాఖలు చేసింది. అయితే గతంలోనే దీనిపై విచారణ జరగాల్సి ఉండగా మూడు రోజుల పాటు వంశీని పోలీసులు కస్టడీకి తీసుకున్న నేపథ్యంలో ఈ పిటిషన్‌ను సీఐడీ వెనక్కి తీసుకుంది. ఇప్పుడు తిరిగి సీఐడీ పిటిషన్ దాఖలు చేయడంతో ఈరోజు వర్చువల్‌గా వంశీని కోర్టులో హాజరుపర్చగా.. న్యాయాధికారి ఈనెల 17 వరకు రిమాండ్ విధిస్తూ ఆదేశాలు చేశారు. అలాగే వంశీతో పాటు మరో ఇద్దరిని పోలీసులు మూడు రోజుల పాటు కస్టడీకి తీసుకుని విచారించారు. అయితే విచారణలో వంశీ సరైన సమాధానాలు చెప్పలేదని, సమాధానాలు దాట వేసిన నేపథ్యంలో ఆయన నుంచి మరింత సమాచారాన్ని రాబట్టేందుకు ఏ4 వీరరాజు, వంశీని మరో పది రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై కూడా కోర్టు వాదనలు జరిగాయి. అయితే ఈ పిటిషన్‌పై నేడు లేదు రేపు కోర్టు తీర్పు ఇచ్చే అవకాశం ఉంది

# పదోతరగతి హాల్‌టికెట్లు విడుదల

మొదటిపేజీ తరువాయి

(9552300009)ఎడ్యూకేషనల్ సర్వీస్‌ను సెలెక్ట్ చేయడం ద్వారా హాల్ టికెట్లు పొందవచ్చని స్పష్టం చేశారు. అప్లికేషన్ నెంబర్ లేదా విద్యార్థి ఐడీ, జన్మదిన తేదీ ద్వారా హాల్ టికెట్లు పొందవచ్చని చెప్పారు. ఈ మేరకు సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్‌లో తెలిపారు. ఆల్ ది బెస్ట్, కీప్ సైనింగ్ అని మంత్రి లోకేష్ ట్వీట్ చేశారు.

# 8వతేదీకల్లా అభ్యర్థుల ఖరారు.?

మొదటిపేజీ తరువాయి

చెరో సీటు కేటాయించనున్నట్లుగా పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

ఎస్సీ మాదిగ నుంచి ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ పేరు ప్రధానంగా పరిశీలనలో ఉంది. ఆయనతోపాటు దొమ్మాటి సాంబయ్య, రాచమళ్ల సిద్ధేశ్వర్ రేసులో ఉన్నారు. ఎస్సీ మాల నుంచి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ పేరు ప్రధానంగా పరిశీలనలో ఉంది. ఓసీల్లో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, టీపీసీసీ నేత జెట్టి కుసుమ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్ రేసులో మిగిలారు. ఎంబీసీల నుంచి సీనియర్ నేతల పేర్లను పరిశీలిస్తున్నారు. అయితే అసెంబ్లీ



ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు సీపీఐకి ఒక సీటు కేటాయించాల్సి వస్తే మళ్లీ సమీకరణలు మారతాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికపై ఈ నెల 6వ తేదీ సాయంత్రంగానీ, 7న గానీ సీఎం రేవంత్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి భేటీఅయి.. 8వతేదీకల్లా అభ్యర్థులను ఖరారు చేయనున్నట్లు సమాచారం.

# చేతిలో కెమెరా.. ముందు సింహం


మొదటిపేజీ తరువాయి

గిర్ జాతీయ ఉద్యానవనంలో జంగిల్ సఫారీని ఆస్వాదించారు. ఆదివారం రాత్రి గిర్ జాతీయ ఉద్యానవనంలో ఉన్న రాష్ట్ర అటవీ శాఖ అతిథి గృహం సింగ్ సదన్‌కు ప్రధాని మోదీ చేరుకున్నారు. రాత్రి విశ్రాంతి తర్వాత సోమవారం ఉదయం జంగిల్ సఫారీకి వెళ్ళారు. ఆదివారం సాయంత్రం ప్రధాని మోదీ సోమనాథ్ ఆలయంలో ప్రార్థనలు చేశారు.

ప్రధాని మోదీ సఫారీలో వెళ్తుండగా నేషనల్ పార్క్‌లో సింహాలు సూర్యరశ్మిని ఆస్వాదిస్తూ కనిపించాయి. ఆ దృశ్యాలను తన చేతిలోని కెమెరాలో బంధింస్తూ ముందుకు సాగారు. మధ్యలో ఒకచోట జీపు ఆపించి ప్రధానమంత్రి పలాష్ పువ్వులు కోశారు. వసంతకాలంలో మాత్రమే ఈ పువ్వులు విరబూస్తాయి. ఈ విశేషాలను చెప్తూ వన్యప్రాణులను సంరక్షించి, వాటి వైవిధ్యాన్ని కాపాడాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోషల్ మీడియాలో ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

**– జాతి భవిష్యత్తు మీ చేతుల్లోనే..**

ఈ భూమిపై జీవవైవిధ్యం, వన్యప్రాణులను కాపాడాల్సిన బాధ్యత మనపై ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. 'ఈ రోజు ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం సందర్భంగా, ఈ భూమి అద్భుతమైన జీవవైవిధ్యాన్ని కాపాడటానికి మన అంకితభావాన్ని ప్రకటిద్దాం' అని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరూ ఇందులో



భాగస్వామ్యులు అవ్వాల్సిన అవసరం ప్రధాని పేర్కొన్నారు. ఈ జాతుల భవిష్యత్తును రక్షించండి. వన్యప్రాణులను కాపాడటంలో భారతదేశం చేస్తున్న కృషిని చూసి గర్విస్తున్నట్లు తెలిపారు.

# రాష్ట్రవ్యాప్తంగా 17 కేసులు నమోదు

మొదటిపేజీ తరువాయి

ఆయన్ను ఆయాలకు తీసుకెళ్లబోతున్నారు. ఇప్పుడు రాజంపేట జైలు నుంచి ఆయన్ను నరసరావుపేట తరలిస్తున్నారు. ఇంకా చాలా చోట్ల వారెంట్లు రెడీ అవుతున్నట్టు కనిపిస్తోంది..! రాష్ట్రవ్యాప్తంగా పోసానిపై వివిధ స్టేషన్లలో 30 పైగా ఫిర్యాదులు పోలీసులకు అందాయి. వాటిల్లో 17 కేసులు నమోదయ్యాయి. లేటెస్ట్‌గా మూడు జిల్లాలకు చెందిన పోలీసు అధికారులు రాజంపేట జైలుకి వెళ్లారు. గుంటూరుజిల్లా నరసరావుపేట టూ టౌన్ పోలీసులు, అనంతపురం రూరల్, అల్లూరి సీతారామరాజు జిల్లా పోలీసులు.. పోసానిని తమకు అప్పగించాలని రాజంపేట జైలు అధికారులకు పీటీ వారెంట్లు అందించారు. పోసానిని అప్పగిస్తే తీసుకెళ్లేందుకు వాహనాలు కూడా సిద్ధం చేసుకున్నారట.

మూడు జిల్లాల పోలీసులు ఒకేసారి రావడంతో.. ముందుగా పోసానిని ఎవరికి అప్పగించాలనే దానిపై రాజంపేట పోలీసులు ఉన్నతాధికారులతో చర్చించారు. నిబంధనలు పరిశీలించిన అనంతరం పోసానిని పల్నాడుజిల్లా నరసరావుపేట పోలీసులకు అప్పగించారు. వైద్య పరీక్షల అనంతరం పోసానిని నరసరావుపేటకు తరలించారు. వరుసగా కేసులు.. పీటీ వారెంట్లు పోసానిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. పోసానితో పాటు వైసీపీ నేతలపై తీవ్రంగా మండిపడ్డారు ఎమ్మెల్యే గోరంట్ల



బుచ్చయ్య చౌదరి. పోసాని ఒక మూరు?డు. పోసాని లాంటి వాళ్లతో అప్పుడు తిట్టించి ఇప్పుడు గగ్గోలు పెడతారా? అని నిలదీశారు. తప్పు చేసిన వాళ్లను ఈ ప్రభుత్వం వదిలిపెట్టదన్నారు.

# 14 వేల అంగన్‌వాడీ పోస్టులకు ముహూర్తం ఫిక్స్

మొదటిపేజీ తరువాయి

మంత్రి సీతక్క సచివాలయంలో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. మార్చి 8న పరేడ్ మైదానంలో నిర్వహించే కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. దేశంలోనే అత్యుత్తమ మహిళా సాధికారత విధానాన్ని రూపొందిస్తామని, పలు రాష్ట్రాల్లో చేపట్టిన మహిళా సంక్షేమ కార్యక్రమాలపై అధ్యయనానికి ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేస్తామని మంత్రి చెప్పారు. కాగా అంగన్‌వాడీ టీచర్, హెల్పర్ పోస్టులకు కనీసం ఇంటర్ పాసై ఉండాలన్న నిబంధన ఈసారి ప్రభుత్వం తెరపైకి తీసుకువచ్చింది. అలాగే ఈ పోస్టుల భర్తీకి వయోపరిమితి 18 నుంచి 35 ఏళ్లు నిండిన వివాహిత మహిళలు మాత్రమే అర్హులు. నోటిఫికేషన్ వచ్చాక ఆసక్తి కలిగిన వివాహిత మహిళలు ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చు.

తెలంగాణ లాసెట్ 2025 దరఖాస్తులు ప్రారంభం.. పరీక్ష ఎప్పుడంటే?

తెలంగాణ లా కోర్సుల్లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు నిర్వహించే లాసెట్‌కు ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ఆలస్యంగా ప్రారంభమయ్యింది. మార్చి 1వ తేదీన సాయంత్రం 4గంటల తర్వాత దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. షెడ్యూల్ ప్రకారం ఆ రోజు మధ్యాహ్నం నుంచే దరఖాస్తుల స్వీకరణ ప్రారంభంకావాల్సి ఉండగా, ఉదయం నుంచే అభ్యర్థులు కంప్యూటర్ల ముందు పడిగాపులు కాశారు. దీంతో తొలిరోజు కేవలం 30 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. ఏప్రిల్ 15 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. తెలంగాణ లాసెట్, పీజీఎల్‌సెట్ పరీక్షలు జూన్ 6వ తేదీన జరగనున్నాయి.

# మెగా డీఎస్సీతో 16,347 టీచర్ పోస్టుల భర్తీకి త్వరలో ప్రకటిస్తాం

మొదటిపేజీ తరువాయి

ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రి నారాలోకేష్ బడ్జెట్ పద్దులపై చర్చించారు. మెగా డీఎస్సీతో 16,347 టీచర్ పోస్టుల భర్తీకి త్వరలో ప్రకటిస్తామని అన్నారు.

ఏపీ వ్యాప్తంగా స్కూళ్ల ప్రహరీ గోడను పూర్తిచేయాలంటే రూ.3వేల కోట్లు అవుతుందని తెలిపారు. మనబడి మనభవిష్యత్తు, ఉపాధి హామీ కింద దశలవారీ చేపడుతామని అన్నారు. డ్రగ్స్ వద్దు బ్రో అనే క్యాంపెయిన్ ఈ ప్రభుత్వం చేపట్టిందని గుర్తుచేశారు. ప్రతి పాఠశాలలో ఈగల్ టీంలు ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. అన్ని కాలేజీలకు, పాఠశాలల్లో వీటిని ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. పేరెంట్ టీచర్ మీటింగ్‌లో స్టార్ రేటింగ్ ఆధారంగా మౌలిక సదుపాయాలు, మంచి విద్య అందించడంలో ప్రణాళికలు వేస్తున్నామని తెలిపారు. 117 జీవోతో నిరుపేదలకు విద్యను దూరం చేశారని మండిపడ్డారు. గత జగన్ ప్రభుత్వ నిర్వాకంతో 12 లక్షల మంది విద్యార్థులు తగ్గిపోయారని చెప్పారు. దీనికి ఓ ప్రత్యమ్నాయంపై సభ్యులతో చర్చించాలని నిర్ణయించామన్నారు. మధ్యాహ్నం ఓ సమావేశం ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. ఇన్ కంప్లీట్‌గా ఉన్న పనులన్ని పూర్తిచేస్తామని చెప్పారు.117 జీవోకు ప్రత్యమ్నాయంగా తీసుకువచ్చే జీవో ఆధారంగా సభ్యుల సలహాలతో ముందుకు వెళ్తామని అన్నారు. నాడు నేడుపై ఆరోపణలు వచ్చాయి ఇందులో నాణ్యత లేదన్నారని చెప్పారు. నాడు నేడుపై రిపోర్టు తీసుకుని యాక్షన్ తీసుకుంటామని అన్నారు. రంపచోడవరం నియోజకవర్గంలో 80 పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు అమలు చేస్తున్నామని తెలిపారు.

సీసీ టీవీలు, లైటింగ్ పాఠశాలల వద్ద ఏర్పాటు చేస్తామన్నారు. లెర్నింగ్ ఎక్స్ లెన్స్ ఆఫ్ ఏపీ కింద సీఎస్ఆర్ నిధులు తెచ్చి అభివృద్ధి చేయాలని అన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎలా అయితే సీఎస్ఆర్ ద్వారా అభివృద్ధి చేస్తున్నారో అలా మనం కూడా చేద్దామని చెప్పారు. ప్రశ్నోత్తరాల సమయంలో నాల్గో ప్రశ్నను వైసీపీ సభ్యులు అడిగారు. వారికి సమాధానం ఇస్తానని డిప్యూటీ స్పీకర్‌ను మంత్రి లోకేష్ అభ్యర్థించారు. టీవీలో అయినా సభ్యులు సమాధానం చూసుకుంటారని డిప్యూటీ స్పీకర్ తెలిపారు. టీవీలో చూడటం కాదు టీవీలు బద్దలు అవుతాయని మంత్రి నారా లోకేష్ విమర్శించారు.

# ఏపీ ప్రభుత్వంపై సంచలన ఆరోపణలు

మొదటిపేజీ తరువాయి


వెలుపల సీఎం రేవంత్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ చేపడుతోన్న బనక చర్లపై తమ అభ్యంతరాన్ని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌కు తెలియజేశామన్నారు. అయితే ఏపీ నుంచి ఈ బనకచర్ల ప్రాజెక్ట్‌పై తమకు ఎలాంటి డీపీఆర్ రాలేదని మంత్రి వివరించారని చెప్పారని తెలిపారు. అలాగే పాలమూరు, రంగారెడ్డి, సమ్మక్క - సారక్క ప్రాజెక్టులకు.. త్వరగా నీటి కేటాయింపులు చేయాలని మంత్రిని కోరినట్లు ఆయన వివరిం చారు. ఇక తమ ప్రాజెక్టులకు సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ) క్లియరెన్స్ ఇంకా రాలేదని పేర్కొన్నారు. మరోవైపు తెలంగాణలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వాలని కోరామని చెప్పారు.



# ఘనంగా జర్నలిస్ట్ ప్రణయ్ ముదిరాజ్ బర్త్ డే వేడుక



తొలిఅడుగు,శేరిలింగంపల్లి: టీయూడబ్ల్యూజే - ఐజేయు శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్ వైస్ ప్రెసిడెంట్, సీనియర్ జర్నలిస్ట్ ప్రణయ్ ముదిరాజ్ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కొండ విజయకుమార్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టియుడబ్ల్యు జే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, జాతీయ కౌన్సిల్ సభ్యులు ఎండి సలీం పాషాలు ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్ ను కట్ చేసి ఒకరికి ఒకరు పంచుకున్నారు. ఈ సందర్భంగా ప్రణయ్ ముదిరాజ్ కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి తిరుపతిరెడ్డి, క్రమశిక్షణ కమిటీ సభ్యులు మాధవరెడ్డి, ధూపం ప్రసాద్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షుడు దొడ్ల శ్రీనివాస్, కోశాధికారి వరుణ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎండి యాసిన్, కార్యదర్శి సాద నరేష్, కార్యవర్గ సభ్యులు శంకర్, మహేందర్, జర్నలిస్టులు భూమేష్, విజయ్ ప్రవీణ్ నరసింహసాగర్, ప్రవీణ్ కుమార్, శశికాంత్, షఫీ, షకీల్, బసవరాజ్, ప్రభాకర్ రెడ్డి, సాల్వడర్, సీనియర్ జర్నలిస్టు నగేష్, తదితరులు ఉన్నారు.



# టీయూడబ్ల్యూజే -ఐజేయూ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన

- జిల్లా వ్యాప్తంగా జోరుగా సభ్యత్వ నమోదు.
- శేరిలింగంపల్లిలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి.




తొలిఅడుగు, శేరిలింగంపల్లి: త్వరలో జరగబోయే టీయూడబ్ల్యూజే - ఐజేయూ రంగారెడ్డి జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని యూనియన్ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షులు కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం శేరిలింగంపల్లి నియోజకవర్గ అధ్యక్షులు కొండా విజయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ... మార్చి నెల ఒకటో తేదీ నుండి 3 వ తేదీ వరకు జిల్లాలో యూనియన్ సభ్యత్వ నమోదు చేపట్టగా మంచి స్పందన లభించిందన్నారు. త్వరలో జిల్లా మహాసభలు నిర్వహించాలని ఇటీవలే జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించినట్లు తెలిపారు. ఈ మహాసభల సందర్భంగా జిల్లాలో 25 ఏళ్ళు పూర్తి చేసుకున్న జర్నలిస్టులకు ప్రత్యేక సన్మాన కార్యక్రమం నిర్వహించచనున్నట్లు అందులో భాగంగా శేరిలింగంపల్లి నియోజకవర్గములో 25 ఏళ్ళు పూర్తి చేసుకున్న సీనియర్ జర్నలిస్టుల జాబితాను సిద్ధం చేసి ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా నూతనంగా యూనియన్ లో చేరిన వివిధ మీడియా సంస్థలకు చెందిన విజయ్, భూమేష్, షకీల్,శశి, ప్రవీణ్, షఫీ, శ్రీనివాస్, ఖాజా తదితరులకు శ్రీకాంత్ రెడ్డి చేతుల మీదుగా సభ్యత్వాన్ని అందించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సలీమ్ పాషా,జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్,కార్యదర్శి దూపం ప్రసాద్,క్రమశిక్షణ కమిటీ కన్వీనర్ మాధవ రెడ్డి ప్రెస్ క్లబ్ ,వైస్ ప్రెసిడెంట్లు ప్రణయ్ ముదిరాజ్,శ్రీనివాస్,ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎండి యాసీన్, కోశాధికారి వరుణ్,కార్యదర్శి నరేష్,నాగరత్నం,ప్రవీణ్ కార్యవర్గ సభ్యులు శంకర్,నర్సిహ్మా, షర్ఫ్యొద్దీన్ మహేందర్, బస్వకుమార్ ప్రభాకర్ రెడ్డి,టిల్లు,సీనియర్ జర్నలిస్ట్ నగేష్,తదితరులు పాల్గొన్నారు.

# విద్యా వ్యవస్థ ముఖచిత్రం మారాలి: మంత్రి శ్రీధర్ బాబు



తొలిఅడుగు,: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రమాణాలను అత్యున్నత స్థాయికి తీసుకెళ్లడం ద్వారా పాఠశాల విద్య ముఖచిత్రాన్ని సమూలంగా మార్చాలని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశించారు. సోమవారం నాడు విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డా. యోగితా రాణా ఇతర ఉన్నతాధికారులతో విద్యాసంస్కరణలపై సమీక్ష నిర్వహించారు. ఒకప్పుడు ప్రపంచానికి ప్రతిభావంతులను అందించిన ప్రభుత్వ స్కూళ్లు ఎందు వల్లనో ఇప్పుడా పరిస్థితిలో లేవని ఈ సందర్భంగా మంత్రి వ్యాఖ్యానించారు. ప్రైవేటు పాఠశాలలతో పోటీ పడలేక పోతున్నామని దీనికి దారితీసిన కారణాలపై అధ్యయనం చేసి మార్పులకు శ్రీకారం చుట్టాలని శ్రీధర్ బాబు సూచించారు. “ స్కూళ్లలో మౌలిక సదుపాయాలు మరింత మెరుగు పర్చడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు కూడా అత్యుత్తమ చదువులను అందించాలని సిఎం రేవంత్ రెడ్డి సంకల్పించారు. ఇందుకు అనువైన పరిస్థితులను విద్యాశాఖ కల్పించాలి. గుజరాత్ నుంచి ఏటా 30- 40 మంది ప్రభుత్వ ఉపాధ్యాయాలు సింగపూర్ కు వెళ్లి ఉన్నత శిక్షణ పొంది వస్తున్నారు. ఆ తరహా ప్రయత్నం మనవద్ద కూడా జరగాలి. ఫిన్లాండ్, ఫ్రాన్స్, యుకెలలోని విద్యాప్రమాణాలపై అధ్యయనం చేసి మన వద్ద కూడా ఆ స్థాయి విద్యను ప్రవేశ పెట్టాలి. పాఠ్యాంశాలను మార్చాలి. సింగపూర్ ప్రభుత్వం మన దగ్గర ప్రపంచస్థాయి విద్యా సంస్థలను ఏర్పాటు చేయడానికి అంగీకరించింది. త్వరలోనే సింగపూర్ బృందం పర్యటిస్తుంది. మన ఉపాధ్యాయులను కూడా ఇతర దేశాలకు పంపించి నైపుణ్యాలను పెంచేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది”. దానికి సంబంధించిన విధివిధానానలు సిద్ధం చేయాలని శ్రీధర్ బాబు ఉన్నతాధికారులను ఆదేశించారు. “వచ్చే 2-3 ఏళ్లలో మన విద్యావిధానంలో సమూల మార్పులు జరగాలి. విద్యపై ఎంతో ఖర్చు పెడుతున్నా ఆశించిన ఫలితాలు కనిపించడం లేదు. ఢిల్లీలోని ప్రభుత్వ స్కూళ్ళను పరిశీలించి అందులో మెరుగైన విధానాలను అమలు చేసే విషయం పరిశీలించాలని శ్రీధర్ బాబు ఆదేశించారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సును కర్రికులమ్ లో భాగం చేయాలి:

“కింది తరగతుల నుంచే విద్యార్థులకు కృత్రిమ మేధపై అవగాహన కల్పించాలి. హైస్కూలు స్థాయిలో దానిని వినియోగించి తెలివితేటలను పెంచుకునేలా చూడాలి. భేషజాలకు పోకుండా కన్సల్టెంట్ల సేవలను తీసుకోవాలి. మన ఆలోచనల కంటే వారి సూచనలు వాస్తవికంగా ఉంటాయి. ఒకప్పుడు డిఇఓలు తరచూ స్కూళ్లను తనిఖీ చేసేవారు. ఎంఇఓలు కూడా ఇతర పనులు చేస్తున్నారు తప్ప విద్యాప్రమాణాలు పెంచే ప్రయత్నం జరగటం లేదు. స్కూళ్లలో వకృత్వ పోటీలు జరిగేవి. విద్యార్థులను పిక్నిక్ లకు తీసుకెళ్లేవారు. ఎక్సకర్షన్లు ఉండేవి. ప్రైవేటు స్కూళ్లలో ఇవన్నీ జరుగుతున్నాయి. వచ్చే తరం పిల్లలకు మనం ప్రపంచస్థాయి విద్యను అందించగలిగితేనే వాళ్లు పోటీ ప్రపంచంలో మనగలగుతారు. ఈ విషయాన్ని గుర్తెరిగి సమూల మార్పులకు దారి వేయాలి అని శ్రీధర్ బాబు సూచించారు. సమీక్షా సమావేశంలో పాఠశాల విద్య డైరెక్టర్ ఇ. వెంకట నర్సింహారెడ్డి, అదనపు డైరెక్టర్ లింగయ్య, ఓపెన్ స్కూల్ డైరెక్టర్ శ్రీహరిలు పాల్గొన్నారు.

# ఎస్ఎల్బిసి ప్రమాద ఘటన.. హైకోర్టులో విచారణ

హైదరాబాద్ తొలిఅడుగు, : ఎస్ఎల్బిసిలో ప్రమాదం జరిగి దాదాపు పది రోజులు అవుతున్న విషయం తెలిసిందే. తాజాగా సిఎం రేవంత్ రెడ్డి కూడా ఘటన స్థలికి వెళ్లి సహాయకచర్యలకు పరిశీలించారు. మరోవైపు కొందరు ప్రతిపక్ష నేతలు ఈ ఘటనకు సంబంధించి ప్రభుత్వాన్ని విమర్శిస్తూనే ఉన్నారు. తాజాగా ఈ ప్రమాద ఘటన హైకోర్టుకు చేసింది. ఎస్ఎల్బిసి ఘటనపై హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. నేషనల్ యూనియన్ ఫర్ మైగ్రెంట్ వర్కర్స్ అనే సంస్థ టన్నెల్‌లో చిక్కుకున్న వాళ్లని సురక్షితంగా బయటకు తీసుకురావాలి అంటూ.. ఈ పిల్‌ను దాఖలు చేసింది.ప్రమాదం జరిగి ఇన్ని రోజులైనా కార్మికుల ఆచూకీ తెలియకపోవడాన్ని కోర్టు దృష్టికి తీసుకువెళ్లింది. అయితే దీనిపై తెలంగాణ ప్రభుత్వ అడ్వకేట్ జనరల్(ఎజి) సుదర్శన్ రెడ్డి తమ వాదనలు వినిపించారు. ఆర్మీ, సింగరేణి రెస్క్యూ, ఎన్డీఆర్ఎఫ్ బలగాలు సహాయక చర్యల్లో పాల్గొంటున్నాయని ఆయన తెలిపారు. 24 గంటలూ సహాయక చర్యలు కొనసాగుతున్నాయని అన్నారు. ప్రభుత్వం సహాయక చర్యలను పరిశీలిస్తుందని చెప్పి వివరాలను హైకోర్టు నమోదు చేసి.. పిల్‌పై విచారణను ముగించింది.

# తెలంగాణ సర్కార్ భేష్: జాతీయ రైతు సంఘాలు.

హైదరాబాద్ : తొలిఅడుగు, తెలంగాణ రాష్ట్రంలో రైతు సంక్షేమ ప్రభుత్వం కొనసాగుతోందన్నారు జాతీయ రైతు సంఘాల నాయకులు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన జాతీయ రైతు సంఘాల నాయకుల బృందం.. రెండు రోజులుగా రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. ఈరోజు బిఆర్కె భవన్ లోని వ్యవసాయ మరియు రైతు సంక్షేమ కమిషన్ను కలిసింది. రాష్ట్రంలో రైతులు, వ్యవసాయ కోసం అమలవుతున్న పథకాలపై ఆరా తీశారు. ప్రధానంగా దేశంలో ఎక్కడా లేనివిదంగా రాష్ట్రంలో ఏకకాలంలో 2 లక్షల రుణమాఫీ పథకం ద్వారా రైతులు రుణ విముక్తులయ్యారని రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి.. జాతీయ రైతుసంఘం బృందానికి వివరించారు. అదేవిదంగా సన్నాలకు 500 రూపాయల బోనస్ ద్వారా రాష్ట్రంలో సన్నాల సాగు అమాంతం పెరిగిందని దాని ద్వారా రైతులు ఆర్థికంగా ఎదుగుతున్నట్లు తెలిపారు. ఇక రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లాంటి పథకాలు కూడా వివరించారు. జాతీయ రైతు సంఘం నేతలు సైతం రెండు రోజులుగా రాష్ట్రంలో పర్యటించిన విషయాలపై కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు కేవీఎన్ రెడ్డి, భవానీ రెడ్డి, గడుగు గంగాధర్ తో చర్చించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమ ప్రభుత్వం అని జాతీయ రైతు సంఘాల నాయకులు కొనియాడారు. తెలంగాణకు వచ్చిన జాతీయ రైతు సంఘాల నాయకులను సన్మానించింది రైతు కమిషన్.

తొలిఅడుగు
తెలుగు దిన పత్రిక

# సంపాదకీయం

యుఎస్ ఎయిడ్ ఉద్దేశం!

అంతర్జాతీయ అభివృద్ధికి సహాయం అందించేందుకు సంబంధించిన తమ సంస్థ (యు.ఎస్.ఎయిడ్)ను మూసేయాలని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ నిర్ణయం తీసుకున్నారు. దేశంలోని రెండు ప్రధాన పాలక పార్టీలైన బిజెపి, కాంగ్రెస్‌ల మధ్య ఇది ఒక ముష్టి యుద్ధానికి దారితీసింది. ఈ మూసివేత నిర్ణయంతో పాటు యు.ఎస్.ఎయిడ్ నిధుల గ్రహీతలుగా వున్న వారి జాబితా కూడా ప్రకటితమైంది. ఈ జాబితా ఆధారంగా భారతదేశంలో ఓటింగ్ శాతం పెంపుదల కోసం 2.1 కోట్ల డాలర్ల నిధులు అందినట్టు ట్రంప్ చెబుతున్నారు. ఆయన ఎవరో ఒకరిని ఎన్నికయ్యేలా చేసేందుకోసం ఈ నిధులు ఉద్దేశించాయంటూ ట్రంప్ ఈ వాదనను మరింత ముందుకు తీసుకువెళ్లారు. దీని కొనసాగింపుగా మరో ముఖాముఖిలో 'ఓటింగ్ శాతం పెంపుదల కోసం ఈ నిధి భారతదేశంలోని తన స్నేహితుడు మోడీకి చేరింద'ని ఆయన వ్యాఖ్యానించారు. ఈ ప్రకటనలను తీవ్రంగా పరిశీలించవలసిన అవసరముంది. వీటిపై లోతుగా దర్యాప్తు చేయాలి. నిజమని తేలేట్టయితే గనక ఇది మన దేశ ప్రజాస్వామ్య ప్రక్రియలో విదేశీ శక్తుల ప్రత్యక్ష జోక్యం తప్ప మరొకటి కాబోదు. కనుక ఈ డబ్బు నిజంగా ఏ ప్రయోజనాల కోసం ఎవరికి చేరింది, తెలుసుకునే హక్కు మనకుంది.

యు.ఎస్.ఎయిడ్ అనేది ఎలాంటి ప్రతిఫలాపేక్ష లేకుండా అవసరమైన దేశాలకు, సమాజాలకు సహాయం అందజేసే అమాయకమైన సంస్థ ఏమీ కాదు. అమెరికా విదేశాంగ శాఖ వ్యవహారాల కొనసాగింపుగానే అది పనిచేస్తుంది. దాని దుందుడుకు విదేశాంగ విధాన ప్రయోజనాలను ముందుకు తీసుకుపోవడానికే పనిచేస్తుంది. ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో నాటి సోవియట్ యూనియన్ ప్రభావాన్ని వెనక్కు కొట్టడానికే జాన్ ఎఫ్ కెనడీ యు.ఎస్.ఎయిడ్ నెలకొల్పారు. అప్పటి నుంచి ఆ యా దేశాలలో ప్రభుత్వాల మార్పులోనూ అమెరికా కార్పొరేట్ ప్రయోజనాలను కాపాడి సోషలిస్టు ఉద్యమాలను అణచివేయడంలోనూ అది ముఖ్య పాత్రవహించింది. ఇటీవల అంటే 2023లో కూడా మెక్సికో మాజీ అధ్యక్షుడు ఆండ్రూ మాన్యుయేల్ లోపెజ్ ఒబ్రడార్ తన దేశ అంతర్గత వ్యవహారాలలో అమెరికా జోక్యాన్ని ఖండించారు. తన ప్రభుత్వానికి వ్యతిరేకమై గ్రూపులకు యు.ఎస్.ఎయిడ్ నిధులు నిలిపేయాలని డిమాండ్ చేశారు. 2014లో యు.ఎస్.ఎయిడ్ క్యూబన్ ట్విటర్ వేదికగా జున్‌జునే అన్న ప్లాట్‌ఫాంను ఏర్పాటు చేసి సోషలిస్టు క్యూబాలో అశాంతి, అస్థిరత సృష్టించేందుకు ప్రయత్నించింది. అమెరికా ప్రయోజనలకు ముప్పుగా పరిగణించే ప్రభుత్వాలను మార్చివేయడానికి తామిచ్చే సహాయాన్ని సాధనంగా వాడటమనేది కొత్త లక్షణమేమీ కాదు. భారత దేశానికి ఈ విషయంలో మినహాయింపు కూడా లేదు. కేరళలో ఎన్నికైన తొలి కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని తొలగించేందుకు కాంగ్రెస్ పార్టీ ఈ సహాయాన్ని ఎలా వినియోగించిందో సాక్ష్యాధారాలతో సహా బయటపడింది.

1957-59 మధ్య అంటే కేరళలో ఇ.ఎం.ఎస్.నంబూద్రిపాద్ నాయకత్వాన కమ్యూనిస్టు ప్రభుత్వం ఏర్పడిన సమయంలో భారతదేశంలో పనిచేసిన అమెరికా మాజీ రాయబారి ఎల్స్‌వర్త్ బంకర్ ఒక ఇంటర్వ్యూలో ఆ విషయాన్ని కుండబద్దలు కొట్టినట్టుగా చెప్పారు. "మేము కాంగ్రెస్ పార్టీకి ఆర్థిక సహాయం చేశామన్నది వాస్తవం' అని ఆయన చెప్పారు. ఆ ప్రభుత్వాన్ని తర్వాత రద్దు చేసిన సంగతి కూడా తెలిసిందే. బంకర్ వాస్తవాలు బయటపెట్టిన సంచలన ఈ ఇంటర్వ్యూ పాఠం రికార్డులు కొలంబియా విశ్వవిద్యాలయం మౌఖిక చరిత్ర విభాగం ఆర్కైవ్స్‌లో అందుబాటులో వున్నాయి. అదే విధంగా 1973-75 మధ్య భారత దేశంలో పనిచేసిన అమెరికా రాయబారి డేనియల్ పాట్రిక్ మొయిన్‌హాన్ ఇలాంటి మరో ఒప్పుకోలు ప్రకటన చేశారు. ప్రమాదకర శాంతి (డేంజరస్ పీస్) అనే తన పుస్తకంలో మోయిన్‌హాన్ కమ్యూనిస్టుల పట్టును ఎదుర్కోవడం కోసం కాంగ్రెస్ పార్టీకి అమెరికా రెండు సందర్భాల్లో ఒకసారి కేరళలో మరోసారి పశ్చిమ బెంగాల్‌లో నిధులు సమకూర్చిందని వెల్లడించారు. భారత దేశ అంతర్గత రాజకీయ వ్యవహారాల్లో అమెరికా చాలా చురుకైన పాత్ర పోషించిందనీ, గట్టిగా జోక్యం చేసుకుందనీ అమెరికా రాయబారులు స్వయంగా ఒప్పుకున్న ఈ రెండు సందర్భాలు సుస్పష్టం చేస్తున్నాయి. ప్రజాస్వామికంగా ఎన్నికైన కమ్యూనిస్టు ప్రభుత్వాలను కూలదోసేందుకు ఆ విధంగా అమెరికా జోక్యం చేసుకుందని అర్థమవుతుంది.

కనుక కాంగ్రెస్, బిజెపి (లేదా దాని పూర్వ రూపమైన జనసంఫ్స్)లకు విదేశీ జోక్యాన్ని ఆహ్వానించే విషయంలో ఎలాంటి అభ్యంతరం లేదనే వాస్తవాన్ని బట్టి చూస్తే దేశ సార్వభౌమత్వం పట్ల ప్రజాస్వామ్య వ్యవస్థల పట్ల వారి నిబద్ధత ఏపాటిదో లేక నిబద్ధతా లేమి ఎంతటిదో కళ్లకు కడుతుంది. ఈ నేపథ్యంలో చూసినప్పుడు భారత దేశంలో ఓటింగు శాతం పెంపు కోసం 2.1 కోట్ల డాలర్ల చెల్లింపులు చేసినట్టు అమెరికా అధ్యక్షుడు వెల్లడించిన అంశం చాలా తీవ్రంగా తీసుకోవలసి వుంటుంది. దీన్ని విస్మరించడం లేదా తోసిపారేయడం కుదిరేది కాదు. అసలు అది దేనిగురించోనన్నట్లు మాట్లాడుతూ బిజెపి లేదా కాంగ్రెస్‌లు దాన్ని కప్పిపుచ్చడం జరగనివ్వకూడదు. ట్రంప్ ప్రభుత్వ వ్యాఖ్యలు ఆందోళన కలిగిస్తున్నాయనీ ప్రభుత్వం దానిపై పరిశీలన జరుపుతున్నదనీ విదేశాంగ మంత్రి ప్రకటించారు. అంతకు మించి అసలు ఈ చెబుతున్న వాటిలో ఏమైనా నిజముందా లేదా అనేదానిపై మంత్రి పూర్తి మౌనమే వహించారు. కొన్ని మీడియా సంస్థలైతే ఈ నిధులు ఇండియా కోసం కాదనీ బంగ్లాదేశ్ కోసం ఉద్దేశించినవనీ వార్తలు ఇచ్చాయి. ట్రంప్ ఢాకాను ఢిల్లీ అని పొరబడి వుండొచ్చని చెప్పాయి. ఈ రకమైన వివరణ ఆశ్చర్యకరంగా వుండొచ్చు. ఏమైనా భారత దేశ వ్యవహారాల్లో యు.ఎస్.ఎయిడ్ జోక్యందారీ కార్యకలాపాలేమిటన్న దానిపై స్పష్టమైన పారదర్శకమైన వివరాలు సమకూర్చవలసిన బాధ్యత ప్రభుత్వంపైనే వుంటుంది. ట్రంప్ చెప్పిన విషయాలపై ఆర్థిఖ శాఖ కూడా మౌన ముద్ర దాల్చింది. 2023-24లో ఏడు ప్రాజెక్టులకు గాను యు.ఎస్.ఎయిడ్ ద్వారా 75 కోట్ల డాలర్లు (సుమారు 6,501 కోట్ల రూపాయలు) చేరినట్టు ఆ శాఖ వార్షిక నివేదిక పేర్కొంది. నీటి సరఫరా, పారిశుధ్యం వంటి పథకాలు వీటిలో వున్నాయి. అయితే ఈ 2.1 కోట్ల డాలర్ల గురించి మాత్రం ఆ నివేదిక ప్రస్తావించలేదు. ప్రభుత్వ నివేదికలు చెప్పే ప్రకారం యు.ఎస్.ఎయిడ్ ఏర్పడిన తర్వాత ఇప్పటి వరకూ భారత దేశంలోని వివిధ రంగాలలో 555 ప్రాజెక్టులకు లక్షన్నర కోట్ల రూపాయల నిధులు సమకూర్చింది. వరసుగా వచ్చిన అన్ని ప్రభుత్వాలు ఏ పార్టీకి చెందినవనే దాంతో నిమిత్తం లేకుండా యు.ఎస్.ఎయిడ్ నిధులను ఉపయోగించుకున్నాయి. ఇదిలా వుంటే బిజెపి ప్రభుత్వం విదేశీ నిధుల (నియంత్రణ) చట్టాన్ని ఆయుధంగా మార్చుకుని వివిధ పరిశోధనా సంస్థలకూ, స్వచ్ఛంద సంస్థలు (ఎన్‌జివో)లకూ నిధులు రాకుండా అడ్డుకున్నది. అదే సమయంలో ఆర్‌ఎస్‌ఎస్ దాని భావజాలంతో ముడిపడిన ఇతర సంస్థలు మాత్రం నిరాటంకంగా నిధులు తెచ్చుకోవడానికి అనుమతినిచ్చింది.

## ఉద్యోగులకు హెూలీ బొనాంజా.. డీఏ 3 శాతం పెంపు..?



**తొలిఅడుగు, :** హెూలీ సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగులకు కేంద్రం గుడ్ న్యూస్ చెప్పబోతున్నట్లు తెలిసింది. డీఏను (కరవు భత్యం) సరవణ చేయనున్నట్లు తెలిసింది. ఈసారి కూడా డీఏను మరో 3 శాతం పెంచనున్నట్లు సమాచారం. దీంతో ప్రస్తుతం 53 శాతంగా ఉన్న కరవు భత్యం 56 శాతానికి చేరనుంది. అయితే, ఇందుకు సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. మార్చి 14న హెూలీ సందర్భంగా అధికారిక ప్రకటన ఉంటుందని తెలిసింది. పస్తుతం 7వ వేతన సంఘం సిఫార్సుల ప్రకారం ఉద్యోగుల జీతభత్యాలు నిర్ణయిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం సాధారణంగా ఏటా రెండుసార్లు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల డీఏ పెంచుతుంది. ఇది జనవరి, జులైల్లో జరగాల్సి ఉన్నప్పటికీ ఏటా మార్చి, అక్టోబరులో ప్రకటిస్తూ వస్తోంది. ఆలస్యంగా ప్రకటించినా.. బకాయిలతో కలిపి జనవరి, జులై నుంచే చెల్లిస్తారు. ముఖ్యంగా డీఏ సవరణ కోసం ఆల్ ఇండియా కన్జూమర్ ప్రైస్ ఇండెక్స్ ఫర్ ఇండస్ట్రియల్ వర్కర్స్‌ను ప్రాతిపదికగా తీసుకుంటుంది. ఇదే ద్రవ్యోల్బణాన్ని అంచనా వేస్తుంది. గతేడాది అక్టోబర్‌లో దీపావళి కానుకగా డీఏ 3 శాతం పెంచిన విషయం తెలిసిందే. తాజాగా మరోసారి డీఏ పెంపు 3 శాతంగానే ఉండనున్నట్లు తెలిసింది. కేంద్రం డీఏను సవరించిన నేపథ్యంలో రాష్ట్రాలు సైతం తమ ఉద్యోగులకు ఆ మేరకు డీఏ పెంచే అవకాశం ఉంటుంది.

## ఐఆర్‌సీటీసీ, ఐఆర్‌ఎఫ్‌సీలకు నవరత్న హెూదా




**న్యూఢిల్లీ, తొలిఅడుగు,:** ప్రభుత్వరంగ సంస్థలైన ఐఆర్‌సీటీసీ, ఐఆర్‌ఎఫ్‌సీలకు నవరత్న హెూదాను కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. దీంతో నవరత్న హెూదా కలిగిన సంస్థల సంఖ్య 26కి చేరుకున్నాయి. ఆయా సంస్థల ఆర్థిక స్థితిగతులు, ఆదాయ-లాభాల ఆర్జన ఆధారంగా కేంద్రం నవరత్న హెూదాను ఇస్తున్నది. దీంట్లోభాగంగా 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను ఐఆర్‌సీటీసీ రూ.4,270 కోట్ల వార్షిక ఆదాయాన్ని, ఐఆర్‌ఎఫ్‌సీ రూ.26, 644 కోట్ల ఆదాయాన్ని గడించాయి. ఈ రెండు సంస్థలకు కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ శుభాకాంక్షలు తెలియచేశారు. నవరత్న హెూదా కలిగిన పీఎస్‌యూలు పెట్టుబడులు, నిర్వహణపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుంది. కంపెనీ నికర విలువలో 15 శాతం లేదా రూ.1,000 కోట్ల వరకు పెట్టుబడి ప్రతిపాదనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి తీసుకోవాల్సిన అవసరం ఉండదు.

## రాజస్థాన్‌లో సింగేణి విద్యుత్తు ప్లాంట్లు

**తొలిఅడుగు, హైదరాబాద్, :** వ్యాపార విస్తరణలో భాగంగా సింగరేణి సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. రాజస్తాన్‌లో 3,100 మెగావాట్ల సామర్థ్యం కలిగిన విద్యుత్తు ప్రాజెక్ట్‌లను ఏర్పాటు చేయబోతున్నది. ఇందుకు సంబంధించి రాజస్థాన్ ప్రభుత్వంతో ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. రాజస్థాన్ సీఎం భజన్‌లాల్‌శర్మ, తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమక్షంలో రాజస్థాన్ ప్రిన్సిపల్ సెక్రటరీ అలోక్ గుప్తా, సింగరేణి సీఎండీ ఎన్ బలరాం నాయక్‌లు ఈ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. దీనిలో భాగంగా రాజస్థాన్ విద్యుత్తుశాఖ అనుబంధ సంస్థతో సింగరేణి జాయింట్ వెంచర్ విధానం కంపెనీని ఏర్పాటు చేయనున్నారు. ఈ జాయింట్ వెంచర్ కంపెనీతో 1600 మెగావాట్ల థర్మల్, 1,500 మెగావాట్ల సోలార్ విద్యుత్తు ప్రాజెక్ట్‌లను నెలకొల్పుతారు. మొత్తం లాభాల్లో 74% సింగరేణి, 26% రాజస్థాన్ విద్యుత్తు ఉత్పాదన్ నిగం లిమిటెడ్‌కు వాటాగా నిర్ణయించారు.

# చెప్పులు లేకుండా నడిస్తే కలిగే అద్భుతమైన ప్రయోజనాలు..



**తొలిఅడుగు, :** చెప్పులు లేకుండా నడవడాన్ని ఎర్తింగ్ అని కూడా పిలుస్తారు. మన దేశంలో ఎప్పటినుంచో ఈ విధానంపై ప్రజల్లో అవగాహన ఉంది. అయితే, ఇటీవల పలు ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి డాక్టర్లు కూడా దీనినే సూచిస్తుండటంతో మరోసారి పాపులర్ గా మారింది. ఉదయాన్నే లేలేత సూర్యకిరణాల మధ్య పచ్చిక బయళ్ల మధ్య నడవడం కొందరికి అలవాటు ఉంటుంది. శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కోరుకునే వారు ఎవరైనా ఎర్తింగ్ పద్ధతిని ఫాలో అవ్వచ్చని నిపుణులు హైలైట్ చెప్తున్నారు. మానవులు రక్షణ కోసం సుమారు 40,000 సంవత్సరాల క్రితం బూట్లు ధరించడం ప్రారంభించారు. అప్పటి నుండి బూట్లు వంపులు ఉన్న చెప్పులు, సపోర్ట్ ఇచ్చేవి, కంఫర్ట్ ఇచ్చేవి ఇలా రకరకాల డిజైన్లు అందుబాటులోకి వచ్చాయి. ఇంట్లో కూడా చెప్పులేసుకుని తిరిగే రోజులు వచ్చాయి. కానీ ఆధునిక పాదరక్షలు మితిమీరిన మద్దతును కలిగి ఉండటం వల్ల పాదాల కండరాలను ఇవి బలహీనపరిచే అవకాశం ఉందని కొందరు నమ్ముతారు. చెప్పులు లేకుండా నడవడం వల్ల గుర్తించదగిన ప్రయోజనాలు ఉన్నట్టు కొన్ని పరిశోధనల్లో తేల్చారు. చెప్పులు లేకుండా నడిచే పిల్లలలో తరచుగా బూట్లు ధరించే వారితో పోలిస్తే బలమైన పాదాలు ఉంటాయి. పెద్దలకు, ముఖ్యంగా వృద్ధులకు, పాదాల కండరాలను బలోపేతం చేయడం వల్ల కింద పడిపోకుండా సంరక్షించవచ్చు. 2021 అధ్యయనంలో సపోర్టివ్ ఫుట్‌వేర్ నుండి మినిమల్ ఫుట్‌వేర్‌కు మారిన పెద్దలు ఆరు నెలల్లో పాదాల బలం 57 శాతం పెరిగిందని వెల్లడించిందని కోల్‌కతా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌కు చెందిన వైద్య నిపుణుల పేర్కొంటున్నారు. బూట్లు లేకుండా నడవడం వల్ల పాదాలను ఎన్నో రకాలుగా కదిలించే వీలు కలుగుతుంది. ఇది పాదాల మెకానిజంను మెరుగుపరుస్తుంది. పాదాల్లో ఉండే కొన్ని రకాల వైకల్యాలను తగ్గిస్తుంది. నడకలో ఉండే లోపాలను కూడా దీని ద్వారా మార్చుకోగలరు. చెప్పులు ధరించడానికి అలవాటుపడిన వారు మొదట్లో చెప్పులు లేకుండా నడిచేటప్పుడు పాదాలు కాస్త అసౌకర్యానికి గురికావచ్చు.. మెల్లిమెల్లిగా దీనిని అలవాటు చేసుకోవచ్చు. చెప్పులు లేకుండా రోజులో కాసేపు నడవడం వల్ల పాదాల కండరాలు, నరాలు బలంగా అవుతాయి. పాదాల గాయాల ప్రమాదం లేకుండా కండరాలను బలోపేతం చేయడం, సమతుల్యతను మెరుగుపరచడం వంటివి చేస్తాయి.


కార్పెట్ వేసిన ఉపరితలాలపై ఇంటి లోపల చెప్పులు లేకుండా నడవడం సాధారణంగానే సురక్షితం. కానీ గట్టిగా, సాఫ్ట్ గా ఉండే ఫ్లోర్ మీద అంత సేఫ్ కాదు. ముఖ్యంగా బహిరంగ ప్రదేశాలలో చెప్పులు లేకుండా నడవడం వల్ల కోతలు, ఇన్ఫెక్షన్లు (ఉదా. అరికాలి మొటిమలు, అథ్లెట్స్ ఫుట్) వడదెబ్బ వంటి ప్రమాదాలు ఉంటాయి. మధుమేహం లేదా న్యూరోపతి ఉన్నవారికి గాయాల ప్రమాదం ఎక్కువగా ఉంటుంది కాబట్టి చెప్పులు లేకుండా నడవడం వీరికి అంత మంచిది కాదు.

# ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నారా..?



**తొలిఅడుగు, :** మన జీవితంలో చాలా సమస్యలకూ కారణం ఆర్థిక ఇబ్బందులే. డబ్బు లభించడం ఆలస్యమైతే మనలోని ఆనందం తగ్గిపోతుంది. కానీ కొన్ని ప్రత్యేకమైన వస్తువులను ఇంట్లో ఉంచితే ఆర్థిక స్థితి మెరుగవుతుంది. వాస్తు శాస్త్రం ప్రకారం కొన్ని వస్తువులు ఇంట్లో ధనం నిలబడేలా చేస్తాయి. మీరు కూడా మీ ఇంట్లో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా..? ఇంట్లో విపత్తులు, అనారోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు రావడానికి నెగెటివ్ ఎనర్జీ ఒక కారణంగా ఉంటుంది. ఆ నెగెటివ్ శక్తిని తొలగించడానికి వాస్తు శాస్త్రంలో కొన్ని పరిహారాలను సూచించారు. ఏనుగు తెలివితేటలతో, సంపదతో, శక్తితో కూడిన జీవిగా పరిగణించబడుతుంది. ఇంట్లో వెండి ఏనుగు విగ్రహాన్ని ఉంచితే అదృష్టం, ఆర్థిక ప్రగతి పెరుగుతాయని వాస్తు నిపుణులు చెబుతున్నారు. ఇంట్లో ఉత్తర దిశలో లేదా నైరుతి మూలలో ఈ విగ్రహాన్ని ఉంచడం శుభప్రదం. చేప ఆరోగ్యానికి, శాంతికి, ధనప్రాప్తికి చిహ్నంగా పరిగణించబడుతుంది. ఇంతేకాకుండా చేపల ఆకృతి ఇంట్లో సానుకూల శక్తిని పెంచుతుందని వాస్తు నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా వెండి లేదా ఇత్తడితో తయారు చేసిన చేప విగ్రహాన్ని ఇంట్లో ఉంచితే ధన లాభం కలుగుతుందని వాస్తు శాస్త్ర నిపుణులు చెబుతున్నారు. శ్రీకృష్ణుడి చేతిలో వేణువు ఉండడం అందరికీ తెలుసు. అది శాంతిని, ఆనందాన్ని, సంపదను ప్రదర్శిస్తుంది. వాస్తు ప్రకారం ఇంట్లో తూర్పు లేదా ఉత్తర దిశలో వేణువును ఉంచడం ఎంతో శుభప్రదంగా ఉంటుంది. వేణువు నెగెటివ్ ఎనర్జీని తొలగించి ఇంట్లో సంతోషాన్ని, ఆర్థిక ప్రగతిని పెంచుతుంది. సాధారణంగా మనం చూసే కొబ్బరికాయలో మూడు కళ్ళుంటాయి. కానీ అరుదుగా కనిపించే ఒంటి కన్ను కొబ్బరికాయ ప్రత్యేక శక్తిని కలిగి ఉంటుంది. వాస్తు శాస్త్రం ప్రకారం దీన్ని ఇంట్లో ఉంచితే లక్ష్మీదేవి అనుగ్రహం లభిస్తుంది. ఇది ఇంట్లో నిలిచిపోయే నెగెటివ్ శక్తిని తొలగించడమే కాకుండా కొత్త సంపదను ఆకర్షిస్తుంది. గోమతి చక్రం ఒక ప్రత్యేకమైన రత్నం ఇది సముద్రంలో మాత్రమే లభిస్తుంది. దీన్ని ఇంట్లో ఉంచడం వల్ల నిధి ప్రాప్తి కలుగుతుందని నమ్మకం.


## ఈ మొక్క ఆకులు గుండెకు టానిక్.!



**తొలిఅడుగు, :** ఆయుర్వేదంలో అనేక మూలికలు, మందులు ఇవ్వబడ్డాయి. ఇవి శారీరక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడటమే కాకుండా అనేక తీవ్రమైన వ్యాధుల చికిత్సలో కూడా ప్రభావవంతంగా నిరూపించబడ్డాయి. అటువంటి ప్రభావవంతమైన ఔషధం 'పునర్నవ'. ఇది ఒక చిన్న మూలిక. కానీ, దీనికి ఆయుర్వేదంలో సర్వరోగ నివారిణి, అమృతం వంటి లక్షణాలు ఉన్నాయి. దీనిని మంటను తగ్గించేది లేదా గదాపూర్ణ అని కూడా అంటారు. ఈ మూలిక తినడానికి చేదుగా, ఘాటుగా ఉంటుంది. కానీ దీని వినియోగం అనేక తీవ్రమైన వ్యాధుల చికిత్సలో చాలా ప్రభావవంతంగా పనిచేస్తుందని ఆయుర్వేదం రుజువు చేస్తుంది. నేషనల్ సెంటర్ ఫర్ బయోటెక్నాలజీ ఇన్ఫర్మేషన్ ప్రచురించిన ఒక అధ్యయనంలో పునర్నవలో ఇమ్యునో మాడ్యులేషన్, హెపాటో ప్రొటెక్షన్, క్యాన్సర్ వ్యతిరేక, డయాబెటిస్ వ్యతిరేక, వాపు వ్యతిరేక లక్షణాలు ఉన్నాయని కనుగొన్నారు. ఈ లక్షణాలు శరీరాన్ని అనేక రకాల వ్యాధుల నుండి రక్షించడంలో సహాయపడతాయి. దీనితో పాటు, మెగ్నీషియం, సోడియం, కాల్షియం, పొటాషియం వంటి ఖనిజాలు కూడా ఇందులో ఉంటాయి. పునర్నవను ప్రధానంగా మూత్రపిండాలు, మూత్ర సమస్యల చికిత్సలో ఉపయోగిస్తారు. ఇది గుండె ఆరోగ్యానికి కూడా చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. ఎందుకంటే ఇది గుండె పనితీరును మెరుగుపరచడంలో సహాయపడుతుంది. బిపిని నియంత్రిస్తుంది. పునర్నవ అనేది గుండె, మూత్రపిండాల సంబంధిత వ్యాధులతో సహా ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి శతాబ్దాలుగా ఉపయోగించబడుతున్న ఒక ఔషధ మొక్క. పునర్నవ ఉపయోగాలు మూత్రపిండాలు, గుండెకు మాత్రమే పరిమితం కాదు. ఈ మూలిక కామెర్లు, జ్వరం, ఊబకాయం, ఉబ్బసం, రే చీకటి వంటి సమస్యలను నయం చేయడంలో కూడా సహాయపడుతుంది. పునర్నవ వేరు రసం రే చీకటితో బాధపడేవారికి ప్రత్యేకంగా ప్రయోజనకరంగా పరిగణించబడుతుంది. అదనంగా, సమయోచితంగా ఉపయోగించడం వల్ల నొప్పి, వాపును కూడా తగ్గిస్తుంది. ఊబకాయం, జలుబును నయం చేస్తుంది. పేగు పురుగులను చంపుతుంది. చర్మ వ్యాధులు, రక్తహీనతకు ప్రయోజనకరంగా ఉంటుంది. మలబద్ధకం నుండి ఉపశమనం కలిగిస్తుంది. అయితే, పునర్నవ వినియోగం వ్యాధిని బట్టి మారుతుంది. అయితే, ప్రతిరోజూ ఒక గ్లాసు నీటిలో 1 టీస్పూన్ పునర్నవ రసం కలిపి తాగడం సురక్షితం అంటున్నారు ఆయుర్వేద నిపుణులు. రక్తహీనతకు ఈ మొక్క చక్కని పరిష్కారం అంటున్నారు నిపుణులు. రక్తహీనత సమస్యతో ఇబ్బంది పడుతున్న వారికి ఇది దివ్యౌషధంగా పనిచేస్తుంది. హిమోగ్లోబిన్ ఉత్పత్తికి కారణమయ్యే ఐరన్ ఈ ఔషధ మొక్కలో లభిస్తుంది. రక్తం ఉత్పత్తిని పెంచే యాంటీఆక్సిడెంట్లు సైతం ఇందులో ఉంటాయని ఓ అధ్యయనం తెలియజేసింది. అందుకే అనీమియా లేదా రక్తకణాల లోపంతో బాధపడుతున్న వారు దీనిని క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచిస్తున్నారు.

# డ్రై ఫ్రూట్స్ నానబెట్టి తింటున్నారా..?

**తొలిఅడుగు, :** ముఖ్యంగా గ్యాస్, అజీర్తి సమస్యలు దరిచేరవని అంటున్నారు. రాత్రంతా నీళ్లలో నానబెట్టిన నట్స్‌లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయని నిపుణులు అంటున్నారు. వీటితో ఆక్సిడేటివ్ స్ట్రెస్ కూడా తగ్గుతుందని వివరిస్తున్నారు. సాధారణ గింజల కంటే నానబెట్టిన గింజల్లో కేలరీల సంఖ్య కాస్త ఎక్కువగానే ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. రెండిట్లో పోషకాలు అన్నీ సమానంగానే ఉన్నా.. నానబెట్టిన గింజలతో లాభం కాస్త ఎక్కువగానే ఉంటుందని తెలిపారు. డ్రై ఫ్రూట్స్ ఇవి ఆరోగ్యానికి ఎంత మేలు చేస్తాయో మనందరికీ తెలిసిందే.. ఐతే ఈ గింజలను నానబెట్టుకుని తింటే ఆరోగ్యానికి కలిగే ప్రయోజనాలు రెట్టింపవుతాయంటున్నారు నిపుణులు. అదెలాగో తెలుసుకుందాము. బాదం పప్పులను నానబెట్టి తింటే మన శరీరానికి పోషకాలను గ్రహించే శక్తిని కలిగిస్తాయి. గుమ్మడి గింజలను రాత్రంతా నానబెట్టుకుని తింటే అందులోని ఆరోగ్యకరమైన కొవ్వులు శరీరానికి అందుతాయి. నానబెట్టిన డ్రై ఫ్రూట్స్‌ను తీసుకోవడం వల్ల శరీరం వేగంగా పోషకాలను గ్రహిస్తుందని నిపుణులు అంటున్నారు. నివేదిక ప్రకారం.. ఇంకా పచ్చి వాటితో పోలిస్తే నానబెట్టిన గింజలు తీసుకోవడం వల్ల తేలికగా జీర్ణం అవుతాయని నిపుణులు అంటున్నారు. ముఖ్యంగా గ్యాస్, అజీర్తి సమస్యలు దరిచేరవని అంటున్నారు. రాత్రంతా నీళ్లలో నానబెట్టిన నట్స్?లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయని నిపుణులు అంటున్నారు. వీటితో ఆక్సిడేటివ్ స్ట్రెస్ కూడా తగ్గుతుందని వివరిస్తున్నారు. సాధారణ గింజల కంటే నానబెట్టిన గింజల్లో కేలరీల సంఖ్య కాస్త ఎక్కువగానే ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. రెండిట్లో పోషకాలు అన్నీ సమానంగానే ఉన్నా.. నానబెట్టిన గింజలతో లాభం కాస్త ఎక్కువగానే ఉంటుందని తెలిపారు. నీళ్లను పీల్చుకున్న గింజల్లో రుచి



ఎక్కువగానే ఉంటుందని అనేక అధ్యయనాల్లో తేలిందని పేర్కొన్నారు. బాదం, ఎండు ద్రాక్ష, వాల్?నట్, జీడిపప్పు, పిస్తా వంటి వాటిని నానబెట్టి తీసుకోవడమే ఉత్తమమని వివరిస్తున్నారు.

తొలిఅడుగు
తెలుగు దిన పత్రిక

# కుర్రాళ్ళ గుండెల్లో బాణాలు గుచ్చుతున్న భామ

**తొలిఅడుగు,** సరైన క్యారెక్టర్ దొరికితే చాలు తమ నటనతో ప్రేక్షకుల కట్టిపడేస్తున్నారు. అలాంటి వారిలో కామాక్షి భాస్కర్ల ఒకరు. చేస్తుంది చిన్న పాత్రలే అయినా తన నటనతో కట్టిపడేస్తుంది ఈ చిన్నది. సినిమాలో తన నటనతో ఆకట్టుకుంది ఈ చిన్నది.

విరూపాక్ష అలాగే మా ఊరి పొలిమేర సినిమాలో తన నటనతో కట్టిపడేసింది. పొలిమేర 2లోనూ తన నటనతో ప్రేక్షకులను మెప్పించింది కామాక్షి భాస్కర్ల. ఆతర్వాత ఈ అమ్మడు కొన్ని సినిమాల్లో చిన్న చిన్న పాత్రల్లో నటించింది. మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్, రౌడీ బాయ్స్, ఓం భీమ్ బుష్ సినిమాల్లోనూ నటించింది. అలాగే సైతాన్ అనే బోల్డ్ వెబ్ సిరీస్ లో నటించి అందరికి ఆకట్టుకుంది. అందం అభినయం ఉన్న ఈ అమ్మడు తక్కువ ఆ సమయంలోనే మంచి క్రేజ్ తెచ్చుకుంది. ఇక సోషల్ మీడియాలో కామాక్షి చాలా యాక్టివ్ గా ఉంటుంది. రెగ్యులర్ గా ఫోటోలు షేర్ చేస్తూ ఆకట్టుకుంటుంది ఈ అమ్మడు. హాట్ నెస్ కు కేరాఫ్ అడ్రస్ లా ఫోటోలు షేర్ చేస్తూ కుర్రాళ్ళ మతిపోగొడుతోంది ఈ వయ్యారి భామ. తాజాగా ఈ క్రేజీ బ్యూటీ ఫొటోస్ సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. ఓరచూపుతో కుర్రాళ్ళ మతిపోగొడుతోంది ఈ బ్యూటీ. ఈ కుర్రదాని అందాలకు నెటిజన్స్ ఫిదా అవుతున్నారు. ఈ హాట్ బ్యూటీ ఫోటోల పై మీరూ ఓ లుక్కేయండి.




# తెలుగులో రిలీజ్ చేస్తున్నందుకు గర్విస్తున్నాం



**తొలిఅడుగు,** ఛత్రపతి శంభాజీ మహారాజ్ జీవితం ఆధారంగా రూపొంది.. బాలీవుడ్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన 'ఛావా' చిత్రం తెలుగు వెర్షన్ ఈ నెల 7న తెలుగు రాష్ట్రాల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వంలో విక్కీకౌశల్ నట విశ్వరూపం చూపించిన ఈ సినిమాను ప్రతిష్ఠాత్మక గీతా ఆర్ట్స్ సంస్థ తెలుగులో విడుదల చేస్తున్నది. ఈ సందర్భంగా సోమవారం ఈ సినిమా తెలుగు ట్రైలర్‌ని లాంచ్ చేశారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ మరణం తర్వాత.. మొఘల్ ఆధిపత్య ముప్పును మరాఠా సామ్రాజ్యం ఎదుర్కోవాల్సిన పరిస్థితులు తలెత్తినప్పుడు.. శివాజీ వారసత్వం ఛత్రపతి శంభాజీ ద్వారా కొనసాగుతుంది. 'సింహం పోవచ్చు.. కానీ దాని పిల్ల ఇప్పటికీ అడవిలో వేటాడుతూనే ఉంది..' అనే పవర్‌ఫుల్ డైలాగ్‌తో శంభాజీ పాత్రని తెలుగు ప్రేక్షకులకు ట్రైలర్ ద్వారా పరిచయం చేశారు. శత్రువుల శక్తిసామర్థ్యాలు.. గెరిల్లా యుద్ధాలు.. శంభాజీ ధైర్యసాహసాలు.. మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు కుయుక్తలు.. ఈ ట్రైలర్‌లో చూడొచ్చు. ఔరంగజేబుగా అక్షయ్‌ఖన్నా, శంభాజీ ఇల్లాలు యేసుబాయిగా రష్మిక మందన్నా ఈ ట్రైలర్‌లో అలరించారు. ఈ సినిమాను తెలుగులో విడుదల చేస్తున్నందుకు గర్విస్తున్నామని, భాష ఏదైనా అది మంచి సినిమా అయితే దాన్ని తెలుగులోకి తీసుకురావడానికి గీతా ఆర్ట్స్ ఎప్పుడూ ముందే ఉంటుందని, తమ సంస్థ నుంచి వచ్చిన గజనీ, కాంతారా చిత్రాల మాదిరిగానే ఈ సినిమా కూడా విజయం సాధిస్తుందని నిర్మాత బన్నీ వాసు నమ్మకం వెలిబుచ్చారు.

# కడుపు మండిన కాకుల కథ

**తొలిఅడుగు,:** 'చరిత్రలో అందరూ చిలకలు, పావురాలు గురించి రాసిర్రు గానీ.. గదే జాతిలో పుట్టిన కాకుల గురించి రాయలే.. ఇది కడుపు మండిన కాకుల కథ. జమానా జమానాకెల్లి నడిచే శవాల కథ.. అమ్మరొమ్ములో పాలు లేక రక్తం బోసి పెంచిన ఓ జాతి కథ.. ఒక దగడ్ వొచ్చి మొత్తం జాతిలో జోష్ తెచ్చిండు. థూ అనిపించుకున్న కాకులు తల్వార్‌లు పట్టినాయ్.. ఆ కాకులని ఒకటి చేసిన తిరుగుబాటుదారుడి కథ ఇది.. ఓ యువకుడు నాయకుడిగా మారిన కథ..' నాని హీరోగా రూపొందుతోన్న 'ది ప్యారడైజ్' సినిమా 'రా స్టేట్మెంట్' గ్లింప్స్ ప్రారంభంలో వచ్చే వాయిస్ ఓవర్ ఇది. దీన్ని బట్టి ఈ సినిమా ఎలా ఉండబోతున్నదో చెప్పేశాడు దర్శకుడు శ్రీకాంత్ ఓదెల. మృతదేహాలు, మురికివాడలు, ఎగురుతున్న కాకులు.. ఓ అంతుచిక్కని ప్రపంచాన్ని చూపించాడు దర్శకుడు ఈ గ్లింప్స్‌లో. రగ్గడ్ లుక్‌తో చిత్రమైన బాడీ లాంగ్వేజ్‌తో, రెండు జడలతో ఆడియన్స్‌కి గూజ్‌బమ్స్ తెచ్చేలా నాని లుక్ ఉంది. ఈ సినిమాకోసం నాని మేకోవర్ అదిరిపోయింది. తిరుగుబాటు ప్రపంచంలో నాయకుడి ప్రయాణాన్ని చూపించిందీ గ్లింప్స్. వచ్చే ఏడాది మార్చి 26న విడుదల కానున్న ఈ చిత్రానికి కెమెరా: జి.కె.విష్ణు, సంగీతం: అనిరుధ్ రవిచందర్, నిర్మాత : సుధాకర్ చెరుకూరి.



# పాన్ ఇండియా స్టార్స్ హీరోలకు ఫ్యాన్స్ రిక్వెస్ట్‌లు..

**తొలిఅడుగు,:** బార్డర్లు క్రాస్ చేసి, ఇంటర్నేషనల్ దయాస్ మీదకు వెళ్లిన వాళ్లను, లోకల్ ఫీలింగ్ చూపించమని అడగడం కరెక్టో, కాదో కానీ, మూలాలను మర్చిపోకుండా.. అటూ ఇటూ బ్యాలన్స్ చేసుకోండి గురూ అని ఓ రిక్వెస్ట్ పెట్టడంలో మాత్రం అస్సలు తప్పులేదేమో. ప్యాన్ ఇండియా హీరోలుగా ఎదిగినా సరే, అప్పుడప్పుడూ రీజినల్ సినిమాలను కూడా కన్సిడర్ చేయండనే మాటను కాస్త స్ట్రాంగ్‌గానూ చెప్పొచ్చేమో... ఇంతకీ ప్రభాస్, బన్నీ, మహేష్ ఈ మాటలను వింటున్నట్టేనా?

నేను నా రీజినల్ ఆడియన్స్ కి వడ్డించే దమ్ మసాలా బిర్యానీ ఇదే.. నెక్స్ట్ కెరీర్ డ్రైవ్ ఎలా ఉంటుందో ఇప్పుడైతే చెప్పలేనని ముందే ఓపెన్ అయ్యారు సూపర్‌స్టార్ మహేష్. అలా ఎందుకు అనుకుంటారు సార్.. ఓ వైపు మీ రేంజ్ సినిమాలు చేస్తూనే, మరోవైపు రీజినల్ సినిమాల మీద కూడా ఓ లుక్కేయండి అని రిక్వెస్టులు అందుతున్నాయి మహేష్‌కి. మన పుష్పరాజ్ పరిస్థితి కూడా ఇదే. ఎప్పటికైనా మంచి మ్యూజిక్ ఓరియంటెడ్ లవ్‌స్టోరీ చేయాలని ఉందని ఈ మధ్యనే స్టేట్‌మెంట్ ఇచ్చారు. మరి పెరిగిన ఇమేజ్.. క్యూట్ లవ్ స్టోరీకి స్కోప్ ఇస్తుందా? మీరు మనసు పెట్టండి గురూ అన్నీ అవే అవుతాయని అంటోంది అల్లు ఆర్మీ. రెబల్ సైన్యం నుంచి కూడా ప్రభాస్‌కి ఇలాంటి రిక్వెస్టులే అందుతున్నాయి. ప్రతిదీ ప్యాన్ ఇండియా సినిమానే కావాలని కూర్చోవద్దు. అలా చేస్తే కొన్ని స్ట్రాంగ్ స్టోరీలను మిస్ అయిపోతారేమో.. ఒకట్రెండు హ్యూజ్ సబ్జెక్టులు చేసినా, మధ్య మధ్యలో మనవాళ్లకు కనెక్ట్ అయ్యే సినిమాలు చేయండి. అప్పుడే మన గ్రౌండ్ మీద పట్టు ఉంటుందనే సలహాలిస్తున్నారు డార్లింగ్‌కి. ఎగ్జాంపుల్‌గా రీసెంట్ బ్లాక్ బస్టర్ సంక్రాంతికి వస్తున్నాం సినిమాను చూపిస్తున్నారు. ప్యాన్ ఇండియా చిత్రాల సక్సెస్ రేట్లు ఎలా ఉన్నా.. మన వాళ్లను ఉద్దేశించి తీసిన సినిమాలు కాస్ట్ ఫెయిల్యూర్స్ కావట్లేదు. పైగా సినిమా బావుంటే, ఆటోమేటిగ్గా పొరుగు వారు అనువాదం చేసుకుంటారు. అందుకే, కొంచెం థింక్ లోకలీ.. యాక్ట్ గ్లోబలీ అనే కాన్సెప్ట్ మీద దృష్టి పెట్టమంటున్నారు క్రిటిక్స్.



# దుబాయ్ మాకూ కొత్తే ఇదేం మా హోంగ్రౌండ్ కాదు



తొలిఅడుగు,: దుబాయ్: హైబ్రిడ్ మోడల్‌లో భాగంగా చాంపియన్స్ ట్రోఫీలో తమ మ్యాచ్‌లను దుబాయ్‌లో ఒకే వేదికపై ఆడుతున్న భారత జట్టుకు 'పిచ్ అడ్వాంటేజ్' లభిస్తుందని వస్తున్న విమర్శలకు టీమ్‌ఇండియా సారథి రోహిత్ శర్మ ఘాటుగా కౌంటర్ ఇచ్చాడు. దుబాయ్ తమ సొంత గ్రౌండ్ కాదని, ఇక్కడి పిచ్‌లు తమకూ కొత్త సవాళ్లను విసురుతున్నాయని తెలిపాడు. ఇంగ్లండ్ మాజీ క్రికెటర్లు నాసిర్ హుస్సేన్, అథర్టన్‌తో పాటు ఆసీస్ సారథి పాట్ కమిన్స్.. భారత్ అన్ని మ్యాచ్‌లను ఒకే వేదికపై ఆడటం వారికి భారీ ప్రయోజనాన్ని చేకూర్చుతుందని వ్యాఖ్యానించిన విషయం విదితమే. న్యూజిలాండ్‌తో మ్యాచ్ అనంతరం రోహిత్ మాట్లాడుతూ.. 'మేమిక్కడ మూడు మ్యాచ్‌లు ఆడాం. మూడింట్లోనూ పిచ్ భిన్నంగా స్పందించింది. ప్రతిమ్యాచ్‌లోనూ ఇక్కడ కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయి. ఇదేం మా సొంత వేదిక కాదు. దుబాయ్ మాక్కూడా కొత్తే. ఇక్కడ నాలుగైదు పిచ్‌లు ఉన్నాయి. న్యూజిలాండ్‌తో మ్యాచ్ సందర్భంగా ఆరంభంలో బంతి కాస్త స్వింగ్ అయింది. మొదటి రెండు మ్యాచ్‌లలో పిచ్ అలా స్పందించలేదు. గత మ్యాచ్‌లలో బంతి మేం ఆశించినంత తిరగలేదు. కానీ కివీస్‌తో మ్యాచ్ రెండో ఇన్నింగ్స్‌లో బంతి స్పిన్‌కు అనుకూలంగా ఉంది. ఆస్ట్రేలియాతో సెమీస్‌కు ఏ పిచ్‌ను ఉపయోగిస్తారో మాకు తెలియదు. అయితే ఏం జరిగినా అందుకు తగ్గట్టుగా మేం ఆ పరిస్థితులను ఆకలింపు చేసుకోవాలి' అని తెలిపాడు.

పాక్‌లో అయితే దంచికొట్టేవాళ్లం: గంగూలీ

రోహిత్‌తో పాటు మాజీ సారథి సౌరవ్ గంగూలీ కూడా ఈ విమర్శలకు గట్టిగానే బదులిచ్చాడు. దాదా మాట్లాడుతూ 'దుబాయ్ కంటే పాకిస్థాన్ పిచ్‌లు కాస్త మెరుగ్గా ఉంటాయి. ఒకవేళ టీమ్‌ఇండియా గనక అక్కడ ఆడి ఉంటే భారీ స్కోర్లు చేసేది. పిచ్ అడ్వాంటేజ్‌పై కొందరు చేస్తున్న వ్యాఖ్యలన్నీ చెత్తవే. భారత జట్టు గతేడాది టీ20 ప్రపంచకప్ నెగ్గింది. 2023 వన్డే ప్రపంచకప్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా ఫైనల్ చేరింది. పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లో భారత చాలా బలమైన ప్రత్యర్థి. మేం ఎవరినైనా ఓడించగలం' అని వ్యాఖ్యానించాడు.

# ఆసీస్ అడ్డు తొలిగేనా?

**రెండేండ్ల క్రితం డబ్ల్యూటీసీ చాంపియన్‌షిప్‌లో టీమ్‌ఇండియాకు 'గద'ను దూరం చేసి.. ఏడాదిన్నర క్రితం వన్డే ప్రపంచకప్‌లో అజేయంగా ఫైనల్‌కు చేరిన టీమ్‌ఇండియా కప్పు కలను అడ్డుకున్న కంగారూలు మరోసారి రోహిత్ సేన 'చాంపియన్స్' ప్రయాణంలో ఎదురయ్యారు. 11 ఏండ్ల తర్వాత చాంపియన్స్ ట్రోఫీ టైటిల్ దక్కించుకోవాలన్న పట్టుదలతో ఉన్న టీమ్‌ఇండియా కల నెరవేరాలంటే ఆసీస్ అడ్డు తొలగించుకోవాల్సిందే..**




తొలిఅడుగు, దుబాయ్: చాంపియన్స్ ట్రోఫీ టైటిల్ వేటలో ఉన్న భారత జట్టు మంగళవారం మరో కీలక సమరానికి సిద్ధమైంది. నేడు జరుగబోయే తొలి సెమీస్‌లో రోహిత్ సేన.. అగ్రశ్రేణి ఆస్ట్రేలియాతో అమీతుమీ తేల్చుకోనుంది. ఐసీసీ టోర్నీలలో భారత్‌కు కొరకరాని కొయ్యగా మారిన ఆస్ట్రేలియా.. 2023 వన్డే ప్రపంచకప్ ఫైనల్‌తో పాటు అదే ఏడాది వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌లోనూ రోహిత్ సేనను ఓడించింది. ఆ పరాభవాలకు దుబాయ్‌లో బదులు తీర్చుకోవడంతో పాటు చాంపియన్స్ ట్రోఫీ టైటిల్ వేటలో ముందంజ వేయాలంటే మెన్ ఇన్ బ్లూ కంగారూల గండాన్ని దాటాల్సిందే. మ్యాచ్‌లో ఫేవరేట్‌గా భారత్ బరిలోకి దిగుతున్నా ఐసీసీ టోర్నీలలో మనపై ఆసీస్‌కు మెరుగైన రికార్డు ఉంది. స్పిన్నర్లు ఆధిపత్యం చెలాయిస్తున్న దుబాయ్ పిచ్‌పై ఆసీస్ బ్యాటర్ల జోరుకు భారత స్పిన్ మాంత్రికుల మాయాజాలానికి రసవత్తర పోరు జరగడం ఖాయం!

ఫేవరేట్‌గా భారత్

దుబాయ్‌లో ఆడిన మూడు మ్యాచ్‌లలోనూ గెలిచి హ్యాట్రిక్ విజయాల జోష్‌లో ఉన్న భారత్.. సెమీస్ పోరులోనూ ఫేవరేట్‌గా బరిలోకి దిగుతోంది. గత మ్యాచ్‌లో నిరాశపరిచినా రోహిత్, కోహ్లీ, గిల్ మంచి ఫామ్‌లో ఉన్నారు. మిడిలార్డర్‌లో శ్రేయాస్, అక్షర్, హార్దిక్, రాహుల్‌తో భారత బ్యాటింగ్ విభాగం పటిష్టంగా ఉంది. అంతగా అనుభవం లేని ఆస్ట్రేలియా బౌలర్లను ఎదుర్కోవడం పెద్ద కష్టమేమీ కాకపోయినా స్పిన్నర్ జంపాను భారత బ్యాటర్లు ఏ మేరకు నిలువరిస్తారో చూడాలి. దుబాయ్ పిచ్ మ్యాచ్ మ్యాచ్‌కూ భిన్నంగా స్పందిస్తున్న వేళ.. తుది జట్టులో ఎవరిని ఆడిస్తారనేది ఆసక్తికరంగా మారింది. కివీస్‌తో మ్యాచ్‌లో ఇద్దరు పేసర్లు, నలుగురు స్పిన్నర్లతో బరిలోకి దిగిన టీమ్‌ఇండియా.. అదే ఫార్ములాతో ఆడే అవకాశాలుంటే రాణా బెంచ్‌కే పరిమితమవ్వొచ్చు. న్యూజిలాండ్‌తో మ్యాచ్‌లో ఐదు వికెట్లు పడగొట్టిన వరుణ్ చక్రవర్తిని ఆసీస్‌తో ఆడిస్తారా? లేదా? అనేది సస్పెన్సే.

'హెడ్'ఏక్ తొలిగితేనే..


పలు కారణాలతో ఆసీస్ పేస్ త్రయం కమిన్స్, హెజిల్‌వుడ్, స్టార్క్ దూరమవడంతో ఆ జట్టు పేస్ విభాగం బలహీనంగా ఉంది. గత రెండు మ్యాచ్‌లలో ఇంగ్లండ్, ఆఫ్ఘనిస్థాన్‌పై (273) ఆ జట్టు బౌలర్లు తేలిపోయారు. కానీ భారత్ బెంగ అంతా ఒక్కడి పైనే. భారత్‌పై మ్యాచ్.. అదీ ఐసీసీ టోర్నీలంటేనే చెలరేగే ఆడే ట్రావిస్ హెడ్‌ను త్వరగా ఔట్ చేస్తేనే మ్యాచ్‌పై టీమ్‌ఇండియా పట్టుబిగించే అవకాశముంటుంది. ఏ క్షణంలో అయినా మ్యాచ్‌ను మలుపు తిప్పే సామర్థ్యం అతడి సొంతం. బౌలింగ్ బలహీనంగా ఉన్నప్పటికీ హెడ్, ఇంగ్లిస్, స్మిత్, లబూషేన్, మ్యాక్స్‌వెల్, క్యారీ వంటి ప్రపంచ స్థాయి బ్యాటర్లతో ఆ జట్టు దుర్బేధ్యంగా ఉంది. మరి భారత స్పిన్నర్లు ఈ బ్యాటింగ్ లైనప్‌నకు ఎలా అడ్డుకట్ట వేస్తారనేది ఆసక్తికరం.

## ఆధిక్యంలో ప్రజ్ఞానంద, అరవింద్

తొలిఅడుగు, ప్రేగ్: భారత యువ గ్రాండ్ మాస్టర్ ఆర్ ప్రజ్ఞానందతో పాటు అతడి సహచర ఆటగాడు అరవింద్ చిదంబరం ప్రేగ్ మాస్టర్స్ చెస్ టోర్నీలో అగ్రస్థానానికి దూసుకొచ్చారు. ఐదు రౌండ్లు ముగిసేటప్పటికీ ఈ ఇద్దరూ 3.5 పాయింట్లతో తొలి రెండు స్థానాల్లో నిలిచారు. ఐదో రౌండ్‌లో ప్రజ్ఞానంద.. అరవింద్‌తో జరిగిన గేమ్‌ను డ్రా చేసుకున్నాడు. మరో నాలుగు రౌండ్లు మిగిలున్న ఈ టోర్నీలో ఎవరు చాంపియన్‌గా నిలుస్తారన్నది ఆసక్తికరంగా మారింది.



## మూనీ మెరుపులు యూపీపై గుజరాత్ ఘన విజయం



తొలిఅడుగు,: లక్నో: మహిళల ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్) మూడో సీజన్ మ్యాచ్‌లు మరింత రంజుగా సాగుతున్నాయి. సోమవారం జరిగిన మ్యాచ్‌లో యూపీ వారియర్స్‌పై గుజరాత్ జెయింట్స్ 81 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బెత్ మూనీ(59 బంతుల్లో 96 నాటౌట్, 17ఫోర్లు) ధనాధన్ ఇన్నింగ్స్‌తో గుజరాత్ 20 ఓవర్లలో 186/5 స్కోరు చేసింది. ఎకల్‌స్టోన్ (2/34) రెండు వికెట్లు తీసింది. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన యూపీ 17.1 ఓవర్లలో 105 పరుగులకు కుప్పకూలింది. కాశ్వీ గౌతమ్ (3/11), తనూజ కన్వర్ (3/17) మూడేసి వికెట్లు తీశారు.

## రోహిత్ శర్మది ఆకట్టుకునే ఆకారం కాదు..

- టీమిండియా కెప్టెన్‌పై కాంగ్రెస్ మహిళా నేత కామెంట్స్



తొలిఅడుగు,: భారత క్రికెట్ జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ పై కాంగ్రెస్ పార్టీకి చెందిన మహిళా నేత, మాజీ స్పోర్ట్స్ జర్నలిస్ట్ షామా మొహమ్మద్ బాడీ షేమింగ్ కామెంట్స్ చేశారు. రోహిత్ శర్మ చాలా లావుగా ఉంటాడని, ఆయన బరువు తగ్గాల్సిన అవసరం ఉందని తన సోషల్ మీడియా పోస్ట్‌లో పేర్కొన్నారు. అంతేగాక రోహిత్ ఏదో లక్కీగా కెప్టెన్ అయ్యాడని, సచిన్, ద్రవిడ్, గంగూలీ, కోహ్లీ, ధోనీలతో పోల్చితే ఆయన జస్ట్ యావరేజ్ ఆటగాడని వ్యాఖ్యానించారు. ఇప్పటివరకు టీమిండియా కెప్టెన్‌లుగా బాధ్యతలు నిర్వహించిన వారిలో అంతగా ఆకట్టుకోలేని కెప్టెన్ రోహిత్ శర్మ మాత్రమేనని షామా కామెంట్ చేశారు. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా ఆదివారం న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో రోహిత్ శర్మ 17 బంతుల్లో 15 పరుగులు చేసి ఔటయ్యాడు. ఆ తర్వాత కాంగ్రెస్ నాయకురాలు తన సోషల్ మీడియా అకౌంట్‌లో ఈ కామెంట్స్ చేశారు. అయితే ఈ మ్యాచ్‌లో భారత్ 44 పరుగుల తేడాతో గెలిచింది. అయినా షామా మహ్మద్ రోహిత్ శర్మపై బాడీ షేమింగ్ కామెంట్స్ చేయడం సంచలనం రేపింది. షామా కామెంట్స్‌పై నెటిజన్ల నుంచి సానుకూల, ప్రతికూల స్పందనలు వస్తున్నాయి. షామా అభిమానులు ఆమె వ్యాఖ్యలను సమర్థిస్తుండగా.. పలువురు క్రికెట్ ప్రేమికులు ఆమెపై విమర్శలు గుప్పిస్తున్నారు.